క్లుప్తంగా

ఉపాధ్యాయుల కృషితో రాష్ట్ర అవార్డు

గుడ్లవల్లేరు: అంగలూరు బాలికోన్నత పాఠశాల్లో టెన్త్ విద్యార్థులు వరుసగా విజయాలను సాధించేందుకు ఉపాధ్యాయులు చేసిన కృషితోనే రాష్ట్ర స్థాయి అవార్డు వచ్చిందని ఎంఈఓ-2 జి.గోపాలరావు అన్నారు. పెంజెంద్రలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని గురువారం అంగలూరు హైస్కూల్ హెచ్‌ఎం, ఎంఈఓ-1 జి.జగన్మోహనరావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కె.లక్ష్మీ శ్రీనాథ్, కె.నాగబాబు, ఆంజనేయరాజు, రాంబాబు, లక్ష్మీ నాంచారమ్మ, వాసవి, రత్నకుమారి, సలీమా పాల్గొన్నారు.

దివ్యాంగులకు కిరణ్‌రాజ్ ఒక వరం



గుడ్లవల్లేరు: దివ్యాంగులకు మండలంలోని మామిడికోళ్లకు చెందిన వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగ రాష్ట్ర అధ్యక్షుడు బందెల కిరణ్ రాజ్ ఒక వరమని వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ తీట్ల వీరయ్య పేర్కొన్నారు. గుడ్లవల్లేరు నెహ్రూనగర్‌లో గురువారం కిరణ్ రాజ్‌ను డాక్టర్ వీరయ్యతో పాటు తీట్ల రాజా సందీప్ సన్మానించారు. రాష్ట్రంలో తొలగించిన లక్ష దివ్యాంగ ప్రభుత్వ పింఛన్లను వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు మళ్లీ ప్రభుత్వం ఇచ్చేంతవరకు దివ్యాంగులతో కలిసి పోరాడి సాధించిన ఘనత కిరణ్‌రాజ్‌కే దక్కుతుందని వీరయ్య పేర్కొన్నారు.

అల్లినగరంలో 'పొలంబడి'

మండవల్లి: కానుకొల్లు ఆర్‌ఎస్‌కే పరిధిలోని అల్లినగరంలో పొలంబడి కార్యక్రమం మండల వ్యవసాయాధికారి జి.శ్రీనివాసరావు, వ్యవసాయ సహాయకుడు సాయి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది గురువారం నిర్వహించారు. రైతులకు కాండము తొలిచే పురుగును గురించి వివరించారు. ఉనికి ఉధృతి తెలుసుకోవడానికి లింగాకర్షక బుట్టలు అమర్చుకోవాలని పేర్కొన్నారు. ఈ పురుగు చిరుపొట్ట దశలో ఆశిస్తే అది తెల్లకంకికి దారితీసి దిగుబడి తగ్గుతుందన్నారు. లింగాకర్షక బుట్టల ద్వారా పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నట్లు గుర్తిస్తే రైతులు క్లోరో నియంత్రప్రోల్ అనే మందును రెండు మి.లీ. ఒక లీటరు నీటిక కలిపి పిచికారీ చేసుకోవాలని పేర్కొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

గుడివాడ టౌన్: స్థానిక ఏఎన్నార్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. తొలుత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఉపాధ్యాయులు దేశ భవిష్యత్‌ను నిర్మించే శిల్పులని, విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో వారి పాత్ర ఎంతో గొప్పదని అన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకుని దేశ వ్యాప్తంగా ఉపాధ్యాయుల దినోత్సవం నిర్వహించడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్స్ పీజీఎస్ కుమార్, ఎ.రామారావు, కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు పాల్గొన్నారు.

రుద్రపాక పాఠశాలకు ఆర్వో ప్లాంట్ బహూకరణ



నందివాడ: రుద్రపాక గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలకు సుమారు రూ.6,80,000 విలువజేసే ఆర్వో ప్లాంట్‌ను మాజీ సర్పంచ్ పోలిమెట్ల దాసు, కుమారుడు రవి ప్రసాద్ బహూకరించారు. ఈ ప్లాంట్‌ను సెంట్రల్ విజిలెన్స్ విశ్రాంత కమిషనర్ కొసరాజు వీరయ్య చౌదరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ సర్పంచ్ పోలిమెట్ల దాసు, అతని కుమారుడు రవి ప్రసాద్ సహృదయంతో పాఠశాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించడం గర్వంగా ఉందన్నారు. మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, గుడివాడ అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ పిన్నమనేని పూర్ణవీరయ్య, పాలడుగు నానరావు, పాఠశాల హెచ్‌ఎం సుబ్బారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి పీఠానికి ఇత్తడి కవచాలు

మండవల్లి: ఏలూరు రోడ్డులోని అయ్యప్ప స్వామి పీఠానికి గురువారం ఇత్తడి కవచాలు అమర్చారు. కైకలూరుకు చెందిన దాత బుర్ల సత్యనారాయణ రూ.50 వేలతో ఇత్తడి కవచాలను తయారు చేయించి, ఆలయ నిర్వాహకులకు అందజేశారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

మండవల్లి: మండవల్లి గ్రామ సచివాలయ పరిధిలో గురువారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ మెండా ఝాన్సీ, సురేష్‌బాబు పరిశీలించారు. ఏఎన్‌ఎం, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

యూరియా అందరికీ అందడం లేదు

కలెక్టర్ బాలాజీ దృష్టికి తీసుకొచ్చిన రైతులు



ఆర్డీఓ హెలాషారోన్‌తో మాట్లాడుతున్న రైతులు

పెదపారుపూడి: పీఏసీఎస్ ద్వారా వచ్చిన యూరియా కొంత మందికి రైతులకు మాత్రమే అందుతుందని.. అందరికీ అందటం లేదని రైతులు జిల్లా కలెక్టర్ డీ బాలాజీ దృష్టికి తీసుకొచ్చారు. పెదపారుపూడి పీఏసీఎస్‌లో ఉన్న యూరియా నిల్వలను కలెక్టర్ గురువారం సాయంత్రం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యూరియా సక్రమంగా అందుతుందా లేదా అని రైతులను ప్రశ్నించారు. ఇప్పటికి రెండుసార్లు యూరియా వచ్చిందని.. మొదటి సారి పొందిన రైతులకు మళ్లీ అందుతుందని తెలిపారు. దీంతో కొంతమంది రైతులకు అందటం లేదని గ్రామానికి రైతు నాగబాబురావు కలెక్టర్‌కు వివరించారు. దీంతో కలెక్టర్ స్పందిస్తూ ప్రతి రైతుకూ ఎంత యూరియా అవసరం ఉంటుందని అడిగి తెలుసుకున్నారు. వరదల వలన వరి పైరుకు అదనంగా ఒక బస్తా ఎక్కువ అవుతుందని రైతులు తెలిపారు. వ్యవసాయాధికారి ఆంజనేయరావును పిలిచి రైతులకు ఇబ్బంది లేకుండా యూరియా అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడి సొసైటీలో యూరియా సరఫరా చేయించాలి

భట్లపెనుమర్రు(మొవ్వ): మొవ్వ మండలం భట్లపెనుమర్రులో ఉయ్యూరు డివిజన్ ఆర్డీఓ బీఎస్ హెలా షారోన్ గురువారం సాయంత్రం రైతులతో యూరియా సమస్య పై ముఖాముఖి మాట్లాడారు. ఆ గ్రామ రైతులు మాట్లాడుతూ గతంలో కూచిపూడి సొసైటీ ద్వారా యూరియా, ఎరువులు సరఫరా చేసే వారిని తెలిపారు. గత రెండు సంవత్సరాలుగా సరఫరా నిలిచిపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆర్డీఓ దృష్టికి తెచ్చారు. భట్లపెనుమర్రులో మూడు వేల ఎకరాల ఆయకట్టులో వరి సాగు జరుగుతుందన్నారు. ఈ దశలో యూరియా కొరత పట్టి పీడుస్తోందని వాపోయారు. కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశాలతో ప్రతి మండలంలో ఓ గ్రామాన్ని సందర్శించి యూరియా సరఫరాపై రైతుల సమస్యలు సేకరించాలని సూచించిన ఆదేశాలతో ఆమె మొవ్వ మండలం భట్లపెనుమర్రులో సందర్శించి రైతులతో మాట్లాడారు. రైతుల సమస్యలు సేకరించిన అనంతరం ఆమె అధికారులతో మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా సరఫరా చేసిన యూరియాను టోకెన్ సిస్టం ద్వారా పంపిణీకి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గత వారంలో కూచిపూడికి యూరియా వచ్చినప్పుడు ఈ గ్రామస్తులకు అందలేదన్నట్లుగా తెలిసిందని, ఈసారి వచ్చే యూరియా లోడ్‌లో భట్లపెనుమర్రు గ్రామానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఆమె ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కే మస్తాన్, మండల వ్యవసాయాధికారి బి.సురేష్‌బాబు నాయక్, ఆర్ఐ విజయదుర్గ పాల్గొన్నారు.



మన గ్రోమోర్ దుకాణంలో యూరియాను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

యూరియా సరఫరాలో ఆటంకం కలగకూడదు

పామర్రు(మొవ్వ): రైతులకు యూరియా సరఫరా విషయంలో ఎటువంటి ఆటంకం కలగకుండా సాఫీగా పంపిణీ చేయాలని విజిలెన్స్ అధికారి బంగారురాజు సూచించారు. గురువారం పామర్రులోని మన గ్రోమోర్ దుకాణంలో యూరియా సరఫరాపై ఆయన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు యూరియా కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అందరికీ యూరియా సరఫరా చేస్తామని పేర్కొన్నారు. ఎవరైనా బ్లాక్ మార్కెట్ చేస్తే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. రెండు మూడు రోజుల్లో మరింత యూరియా మన రాష్ట్రానికి వస్తుందని తెలిపారు. ప్రతి రైతుకు సరిపడా యూరియా అందించడం జరుగుతుందన్నారు. ఆందోళనతో ఎక్కువ యూరియాను ఎవరూ నిలువ చేసుకోవద్దని పేర్కొన్నారు. అదేవిధంగా వరిపైరుకు మోతాదుకు మించి యూరియా వాడకూడదని తెలిపారు.

లింగవరంలో మౌలిక వసతులు కల్పించండి

కలెక్టర్‌కు విన్నవించిన సామాజిక కార్యకర్త రవికిరణ్



గ్రామంలో సమస్యలను కలెక్టర్‌కు వివరిస్తున్న రవికిరణ్

గుడివాడరూరల్: మండలంలోని లింగవరంలో కనీస మౌలిక వసతులు లేక గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించి ఆదుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీని సామాజిక కార్యకర్త ఎ.రవికిరణ్ వేడుకున్నారు. గ్రామంలోని రైతుసేవా కేంద్రంలో యూరియా పంపిణీని పరిశీలించేందుకు గురువారం సాయంత్రం విచ్చేసిన కలెక్టర్‌ను రవికిరణ్ కలసి గ్రామంలో నెలకొన్న సమస్యలను వివరించారు. గ్రామంలో అస్తవ్యస్తంగా పారిశుద్ధ్యం, డ్రెయినేజీల పూడిక తీత, చెత్త తొలగింపు పనులు చేయడం లేదని తెలిపారు. రాత్రి సమయాల్లో దోమల బెడద ఎక్కువగా ఉందని కలెక్టర్‌కు వివరించారు. స్పందించిన కలెక్టర్ గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమస్యల పరిష్కారానికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ జి.బాలసుబ్రహ్మణ్యం, ఏఓ అనంతలక్ష్మి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

గురజాడలో వైద్య శిబిరం

సాక్షి ఎఫెక్ట్

పమిడిముక్కల: 'పల్లెకు జ్వరమొచ్చింది' అని గురువారం సాక్షిలో ప్రచురితమైన ప్రత్యేక కథనానికి స్పందన లభించింది. జిల్లా వైద్య ఆరోగ్య , మలేరియా శాఖల అధికారుల ఆదేశాల మేరకు గురజాడలో కపిలేశ్వరపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. జ్వరపీడితుల రక్త నమూనాలు స్వీకరించి మందులు అందజేశారు. వైద్య శిబిరంలో 15 మంది రోగులను పరీక్షించి మందులు అందజేసినట్లు వైద్యాధికారి బాలాజీ తెలిపారు. ఇంటింటా ఫీవర్ సర్వే చేసి, గ్రామంలో దోమల నివారణకు ఎబెట్ మందు పిచికారీ చేసినట్లు పేర్కొన్నారు. గ్రామంలో శుక్రవారం కూడా వైద్య శిబిరం నిర్వహిస్తామని తెలిపారు. వైరల్ ఫీవర్స్‌గా గుర్తించామని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయని డాక్టర్ తెలిపారు. కార్యక్రమంలో యూనిట్ ఆఫీసర్ రాజంరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ బాలాజీ

జీఓ నంబర్ 223 విడుదల అభినందనీయం

గుడివాడ టౌన్: ఆలయాల్లో అర్చకుల మనోభావాలు దెబ్బతినకుండా ప్రభుత్వం జీఓ నంబర్ 223 విడుదల చేయడం అభినందనీయం అని అర్చక సమాఖ్య గుడివాడ డివిజన్ అధ్యక్షుడు భరతుల వెంకట రమణమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు అయిన హోమాలు, యాగాలు, అభిషేకాలు, కుంభాభిషేకాలు వంటి వివిధ పూజా కార్యక్రమాల్లో రాజకీయ నాయకులు, ఆలయ అధికారులు జోక్యం చేసుకోవడం వలన అర్చకులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ జీఓ ద్వారా వారి ప్రమేయం తగ్గుతుందని పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించుకోగలుగుతామని ఆయన పేర్కొన్నారు.

పాడి రైతులకు బోనస్ పంపిణీ

పామర్రు(మొవ్వ): పామర్రు పాల సేకరణ కేంద్రంలో 302 పాడి రైతులకు గురువారం సొసైటీ అధ్యక్షుడు, జిల్లా ట్రస్ట్ సభ్యుడు కృష్ణారెడ్డి బోనస్‌ను పంపిణీ చేశారు. 2024-2025 ఆర్థిక సంవత్సరానికి గాను సొసైటీ బోనస్‌గా రూ.2,08,207ను గురువారం పాడి రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పామర్రు శీతల కేంద్రం మేనేజర్ దామోదరకృష్ణ గోపీనాథ్, రూట్ సూపర్‌వైజర్ కే రమేష్, వేతన కార్యదర్శి శ్రీహరి, బొమ్మారెడ్డి మాధవరెడ్డి పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో కేసులో 12 మంది అరెస్ట్

గుడివాడరూరల్: మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 12మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ట్రాఫిక్ ఎస్ఐ పి.నాగరాజు గురువారం తెలిపారు. వీరిని కోర్టులో హాజరు పర్చగా న్యాయమూర్తి ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున మొత్తం రూ.1,20,000 జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

మావులకు పెంజెంద్ర ప్రసిద్ధి

గుడ్లవల్లేరు: జిల్లాలోనే మావులకు పెంజెంద్ర ప్రసిద్ధి అని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. గురువారం గ్రామంలోని మావులు తయారీదారులకు 20 మందికి రూ.10 లక్షల రుణాలను కేడీసీసీ బ్యాంక్ నుంచి అందించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కొసరాజు బాపయ్య చౌదరి, కూటమి నాయకులు వల్లభనేని వెంకట్రావు, కొడాలి రామరాజు, ఏఎంసీ చైర్మన్ పొట్లూరి రవికుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు బొప్పన శివప్రసాద్, ఈడె మోహన్, పోలవరపు వెంకట్రావు పాల్గొన్నారు.

అన్నసమారాధన

మండవల్లి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఉన్న శ్రీ షిర్డీసాయిబాబా ఆలయంలో గురువారం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. మండవల్లి పరిసర గ్రామాలైన గన్నవరం, పెరికెగూడెం, కొర్లపాడు, అయ్యవారిరుద్రవరం తదితర గ్రామాల నుంచి భక్తులు విచ్చేసి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. తొలుతగా షిర్డీ సాయిబాబాకు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు గుడివాడ చిట్టిబాబు, బండారు వెంకయ్య, వెంకటేశ్వరరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

రేపటి్నుంచి ఉచిత మెగా వైద్య శిబిరం

గుడ్లవల్లేరు: ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాజిలిస్ట్ డాక్టర్ సి.ఎల్.వెంకట్రావు ఆధ్వర్యంలో గుడ్లవల్లేరులో శని, ఆదివారాలు ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించనున్నారు. అవసరమైన రోగులకు మందులను పంపిణీ చేయనున్నట్లు వెంకట్రావు పేర్కొన్నారు.

పెంజెంద్ర పీఏసీఎస్ అధ్యక్షుడిగా శివప్రసాద్

గుడ్లవల్లేరు: పెంజెంద్ర పీఏసీఎస్ అధ్యక్షుడిగా బొప్పన శివప్రసాద్ ప్రమాణ స్వీకారం చేశారు. గురువారం జరిగిన ఈ ప్రమాణ స్వీకారోత్సవానికి గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ముఖ్య అతిథిగా విచ్చేసి నూతన కమిటీ సభ్యులను అభినందించారు. కమిటీ చైర్మన్‌గా శివతో పాటు సభ్యులు పెనుమాక చిట్టిబాబు, సయ్యద్ ఖరీదు ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు.

ఆలయాభివృద్ధికి దాతల విరాళాలు

గుడ్లవల్లేరు: స్థానిక శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి దేవస్థాన పునర్నిర్మాణ పనులకు దాతలు విరాళాలను అందించారు. బెజవాడ కాంతారావు కుమారుడు శ్రీనివాసరావు రూ.25వేలు, గుడిపూడి హరిబాబు స్మారకార్థం శివ నాగకుమారి రూ.10,116 విరాళాలను అందించారు. ఈ విరాళాల్ని గుడ్లవల్లేరు ఎస్ఈఆర్‌ఎం విద్యా సంస్థల చైర్మన్ వల్లభనేని వెంకట్రావుకు గురువారం అందించారు. నెహ్రూ పశువుల సంత కమిటీ చైర్మన్ వల్లభనేని సుబ్బారావు, కార్యదర్శి ఈడ్పుగంటి ఉమా, డైరెక్టర్ పోలవరపు వెంకట్రావు, ఆలయ ధర్మకర్తలు మురాల నరేష్, రవి పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మిక నూతన కమిటీ ఎన్నిక

కైకలూరు: మండల వ్యవసాయ కార్మిక సంఘం నూతన కమిటీ ఎన్నిక కలిదిండి ప్రజా సంఘాల కార్యాలయంలో గురువారం జరిగింది. ఇక్కడ జరిగిన 7వ మహాసభలో 14 మందితో కూడిన నూతన కమిటీని ఎన్నుకున్నారు. కలిదిండి మండల అధ్యక్షురాలిగా జమ్ము దుర్గ, కార్యదర్శిగా ఎస్ఎన్ వీ.సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులుగా శేషపు మహంకాళీరావు, చీకటి సత్యనారాయణ, అద్దాని వెంకటేశ్వరరావు, చిప్పాడ దుర్గాప్రసాద్, పెనుమాల రమేష్, జక్కుల దీప్తి, కట్టా లక్ష్మీ తిరుపతమ్మ, పతివాడ కనకదుర్గ, కటారి వెంకమ్మ, కురేళ్ళ రజనీ, సత్యనారాయణ, గోసంగి వినోద్ ఎంపికయ్యారు. ఎన్నికల అధికారిగా వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏ.రవి, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రామకృష్ణ వ్యవహరించారు.

ఘనంగా గణనాథుల నిమజ్జనం

గుడివాడ టౌన్: గణపతి నవరాత్రి మహోత్సవాలు తొమ్మిదో రోజు గురువారం ముగియడంతో పట్టణంలో కోలాహలంగా నిమజ్జనాలు జరిగాయి. వివిధ పందిళ్లలో ఏర్పాటు చేసిన స్వామి వారి విగ్రహాలను డప్పు వాయిద్యాలు, తీన్మార్ బృందాలతో డాన్సులు వేస్తూ రంగులు జల్లుకుంటూ ఈ నిమజ్జనాలు జరిగాయి. అధిక సంఖ్యలో ఊరేగింపులు జరపడంతో ట్రాఫిక్‌కు కొంత అంతరాయం ఏర్పడినా భక్తులు నిమజ్జనాలు జరుపుకున్నారు.

కైకలూరులో..

కైకలూరు: నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో చవితి పందిర్ల వద్ద అన్నసమారాధనలు, సాయంత్రం నిమజ్జన ఊరేగింపులు గురువారం జరిగాయి. ఆటపాక కస్తూరి ప్లాజా వద్ద కైకలూరు తాత్కాలిక సర్పంచ్ కేవీఎస్‌ఎం.నాయుడు ఆధ్వర్యంలో అన్నసమారాధన జరిగింది. పట్టణ, రూరల్ సీఐలు పి.కృష్ణ, వి.రవికుమార్, టౌన్ ఎస్ఐ ఆర్.శ్రీను ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు. శీతనపల్లి రామాలయం వద్ద గ్రామస్తులు చవితి వేడుకలు ముగింపు సందర్భంగా అన్నసమారాధన చేశారు. కైకలూరు అబ్బాస్ వీధి వద్ద వినాయక విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకువెళ్లి నిమజ్జనం చేశారు.

శ్రీ శేష గణపతిగా స్వామి దర్శనం



గుడివాడ టౌన్: స్థానిక మెయిన్ రోడ్‌లో వేంచేసియున్న శ్రీ విఘ్నేశ్వర స్వామి దేవస్థానంలో గణపతి నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని 9వ రోజు గురువారం స్వామిని శ్రీ శేష గణపతిగా అలంకరించి భక్తుల దర్శనానికి ఉంచారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నట్లు ఆలయ ఈఓ వై. శ్రీనివాసరావు తెలిపారు.

రేపు ప్రసాదం లడ్డూ వేలం

ఈ నెల 6వ తేదీ ఉదయం 10 గంటలకు స్వామి ప్రసాదం లడ్డూ ఆలయ ప్రాంగణంలో వేలం వేస్తున్నట్లు ఆలయ ఈఓ తెలిపారు. ఆసక్తి గల భక్తులు వేలంలో పాల్గొని స్వామి ప్రసాదాన్ని పొందాలని ఆయన కోరారు.

హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టరుగా రామలింగేశ్వరరావు

పెదముత్తేవి(మొవ్వ): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా మొవ్వ మండల టీడీపీ అధ్యక్షుడు లింగమనేని రామలింగేశ్వరరావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా పలువురు నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రజలను మోసం చేసిన చంద్రబాబు

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్‌కుమార్



భూషణగుళ్లలో 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమంలో కైలే అనిల్‌కుమార్

భూషణగుళ్ల(పెదపారుపూడి): ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని భూషణగుళ్లలో గురువారం రాత్రి 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చంద్రబాబు సూపర్ సిక్స్ హామీలతో సహా వందకు పైగా హామీలను ఇచ్చారన్నారు. ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర గడిచినా ఒక్క పథకం కూడా సరిగా అమలు చేయలేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలతో పాటు ఇళ్ల స్థలాలు అందించారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతరం వైఎస్సార్ సీపీ విడుదల చేసిన క్యూఆర్ కోడ్‌ను ప్రజలకు స్కాన్ చేసి చంద్రబాబు చేసిన మోసాల గురించి వివరించారు.

గ్రామ కమిటీ ఏర్పాటు

కైలే అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో భూషణగుళ్ల గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కొర్నిపవన్‌కుమార్, ప్రధాన కార్యదర్శులుగా దేవరకొండ శామ్యూల్, చేబ్రోలు నాగేశ్వరరావు, మిటికల ఆంజనేయులు, కలపాల రాజేంద్రకుమార్, కార్యదర్శులుగా కాకా రమేష్, మల్లెబోయిన రాకేష్, దోనె హరీష, రాజబోయిన ప్రసాద్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గోగం సురేష్, జిల్లా అధికార ప్రతినిధి చీకుర్తి వరప్రసాద్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆల రమేష్‌బాబు, జిల్లా వింగ్ కార్యదర్శి కొర్నిపాటి గణపతి, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు మూల్పూరి హరీష, వైఎస్సార్ సీపీ నాయకులు గోళ్ల సోమేశ్వరరావు, పంగా సాంబయ్య, నాగదేశి సుబ్రహ్మణ్యం, మూల్పూరి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నగుళ్లకు డీఎన్నార్ నివాళులు



వైవాకలో నగుళ్ల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీఎన్నార్

ముదినేపల్లి రూరల్: మండలంలోని వైవాకకు చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు నగుళ్ల వెంకటేశ్వరరావు సంస్మరణ కార్యక్రమం గురువారం జరిగింది. పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) కార్యక్రమంలో పాల్గొని వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణతో పాటు పార్టీ ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోమటి విష్ణువర్ధన్, మండల శాఖ అధ్యక్షుడు బోయిన రామరాజు, జిల్లా అధికార ప్రతినిధి మోట్రు ఏసుబాబు, నాయకులు కట్టా మహేష్, పైడిపాటి వెంకటరమణ, నున్న కనకరాజు, నీలపాల రామకృష్ణ, దొడ్డాకుల చంద్రశేఖర్, ప్రభాకర్, ప్రవీణ్, శివాజీ, దివాకర్, రాంబాబు, ఎంపీటీసీ బోయిన నాగరాజు తదితరులు నివాళులర్పించారు. ఇదే గ్రామంలో పార్టీకి చెందిన జంగం శ్యాంబాబు తల్లి జయమణి ఇటీవల మరణించింది. వారి కుటుంబసభ్యులను డీఎన్నార్, నాయకులు పరామర్శించారు.

మండల అకడమిక్ ఫోరమ్స్ ఏర్పాటు

ముదినేపల్లి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన విద్యావిధానంలో భాగంగా మండల అకడమిక్ ఫోరమ్స్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ అకడమిక్ ఫోరమ్‌లో ఎంఈఓ-1, ఎంఈఓ-2తో పాటు కాంప్లెక్స్‌ల క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు హైస్కూల్ సబ్జెక్టులలో నిపుణులైన ఏడుగురు ఉపాధ్యాయులు, ప్రైమరీ స్కూళ్లలో నిపుణులైన ఐదుగురు ఉపాధ్యాయులు సభ్యులుగా ఉంటారు. వీరంతా వారానికి రెండు సార్లు మండలం ప్రాతిపాదికగా స్కూల్ విజిట్ చేస్తారు. ఈ విజిట్‌లో భాగంగా ఎంఈఓ ఒకరు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఇద్దరు హైస్కూల్లో నిపుణులైన ఉపాధ్యాయులు హైస్కూళ్లను విజిట్ చేస్తారు. మరొక ఎంఈఓ ఇద్దరు క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు ఐదుగురు ప్రైమరీ స్కూళ్లల్లో నిపుణులైన ఉపాధ్యాయులు మోడల్ ప్రాథమిక పాఠశాలలో ఏక కాలంలో విజిట్ చేస్తారు. ఈ విజిట్ చేసే ముందు రోజు సంబంధిత ప్రధానోపాధ్యాయులకు ఎంఈఓ తెలియజేస్తారు. ఈ రోజు సంబంధిత పాఠశాలలో ఎవరూ సెలవు పెట్టడానికి అవకాశం ఉండదు. అందరూ తప్పనిసరిగా పాఠశాలకు హాజరు కావల్సి ఉంటుంది. ఇందుకు సంబంధించి ప్రధానోపాధ్యాయులు ముందుగానే రికార్డులను తయారు చేసి సిద్ధంగా ఉంచుకోవాల్సి ఉంటుంది.

నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పమిడిముక్కల: మండలంలోని వీరంకిలాకు, పమిడిముక్కల, పైడికొండలపాలెం, అగినపర్రు, మామిళ్లపల్లి, తెల్లికులపాలెం, దేశన్నపాలెం, మగ్గాలమాలపల్లి, బొడ్డువానిగూడెం, పోతురాజుమాలపల్లి, గంగ్రపువానిగూడెం, కపిలేశ్వరపురం బ్యాంక్ ఏరియాలో శుక్ర, శనివారాల్లో ఉదయం 6 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. అదేవిధంగా కపిలేశ్వరపురం, హనుమంతపురం, ముళ్లపూడి, ఐనంపూడి, వేల్పూరు గ్రామాల్లో ఉదయం 6 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: సింగరాయపాలెం సబ్‌స్టేషన్‌కు చెందిన పెదగొన్నూరు ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం ఏడు నుంచి 10గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ముదినేపల్లి సెక్షన్ విద్యుత్ ఏఈ పూర్ణచంద్రరావు తెలిపారు. ఫీడర్ పరిధిలోని పెదగొన్నూరు, ఉప్పరగూడెం, విశ్వనాద్రిపాలెం, ఈడేపల్లి గ్రామాల్లో విద్యుత్ లైన్లకు దగ్గర్లో ఉన్న చెట్లను కొట్టివేయనున్నట్లు పేర్కొన్నారు. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యార్థులను ప్రోత్సహించేందుకు కృషి

మండవల్లి: విద్యార్థులను ప్రోత్సహించేందుకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కృషి చేస్తున్నట్లు ఆ సంఘ జిల్లా గౌరవాధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు, అధ్యక్షుడు కొండ్రెడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. స్థానిక శుభం ఫంక్షన్ హాల్లో మానవత మండవల్లి శాఖ ద్వితీయ కార్యవర్గ ప్రమాణ స్వీకారం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం రూ.50 లక్షలతో విద్యానిధిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కోటేశ్వరరావును మండవల్లి శాఖ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేయించారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, చాపరాల దుర్గాప్రసాద్, చేబోయిన వీర్రాజు, సూధాబత్తుల విజయ్‌కుమార్, వీరమల్లు నరసింహారావు, గుర్రం శ్యామ్‌కుమార్, గుడివాడ గణేష్ పాల్గొన్నారు.

దేవీశరన్నవరాత్రులకు రాట ముహూర్తం

కైకలూరు: స్థానిక శ్యామలాంబ దేవస్థానంలో చండీ మహాయోగ సహిత శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలకు రాట ముహూర్తంతో పనులను గురువారం ప్రారంభించారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం నంబూరి ప్రతాపరాజు దంపతులు స్తంభానికి పూజలు చేశారు. ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, ఎంపీపీ అడవి కృష్ణ హాజరయ్యారు. ఆలయ ఈఓ వీఎన్‌కే.శేఖర్ మాట్లాడుతూ ఈ నెల 22 నుంచి అక్టోబరు 3వ తేదీ వరకు దేవీ నవరాత్రులు జరుగుతాయన్నారు. వైస్ ఎంపీపీ మంగినేని రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్



నిమ్మకూరు(మొవ్వ): తెలుగువారు గర్వించదగ్గ మహోన్నత వ్యక్తి నందమూరి తారక రామారావు అని హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పేర్కొన్నారు. పామర్రు మండలంలోని నిమ్మకూరుకు నందమూరి బాలకృష్ణ గురువారం విచ్చేశారు. తొలుత ఎన్టీఆర్ బసవతారకం విగ్రహాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు, బడుగు బలహీన వర్గాలకు, మహిళలకు స్థానం కల్పించి వ్యక్తి అన్న ఎన్టీఆర్ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కుమార్ రాజా, టీడీపీ మండల అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.